క్లుప్తంగా

నేడు స్పందన కార్యక్రమం

కంచికచర్ల : ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ పబ్బారి శంకరబాబు ఆదివారం తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వి నియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పోస్టర్ ఆవిష్కరణ



వత్సవాయి : ఈనెల 15న విజయవాడలో జరిగే ప్రజారక్షణ భేరీని జయప్రదం చేయాలని సీపీఎం పార్టీ జిల్లా సభ్యులు చిరుమామిళ్ల హనుమంతురావు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రజారక్షణ భేరీ పోస్టర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మికుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. మండల పార్టీ కార్యదర్శి తమ్మినేని రమేష్, మండల కమిటీ సభ్యులు కె కొండయ్య, బి.రాము పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయాలని పిలుపు

జగ్గయ్యపేట అర్బన్: ఈనెల 15 వ తేదీన విజయవాడలో జరిగే సీపీఎం ప్రజారక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో వాల్‌పోస్టర్లు అంటిస్తూ, కరపత్రాలు అందజేస్తూ ఆపార్టీ నాయకులు ఆదివారం ప్రచారం చేశారు. సీపీఎం నాయకులు దాసరి నాగేశ్వరరావు, రాంప్రసాద్, రావెళ్ల శేషు పాల్గొన్నారు.

ముస్లింల పక్షపాతి సీఎం జగన్

జగ్గయ్యపేట అర్బన్: ముస్లింల అభ్యున్నతికి విశేషంగా కృషిచేస్తున్న గొప్పవ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి అని వక్ఫ్‌బోర్డు జిల్లా కార్యదర్శి షేక్ జుబేర్ కొనియాడారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హర్ దిల్ మే వైఎస్సార్-హమ్ సబ్ జగన్‌కే సాథ్ కార్యక్రమం జగ్గయ్యపేట నియోజకవర్గంలో విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సూచనల మేరకు ఆగస్టు నెల నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా ముస్లిం సోదరులతో సమావేశాలు నిర్వహిస్తూ వారిలో సమైక్యత, సంఘీభావం తీసుకువచ్చేలా కృషి చేశామన్నారు. ముస్లిం సోదరులకు వైఎస్సార్ సీపీ చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధిని వివరించి వారిలో చైతన్యం కల్పించినట్లు వివరించారు. ఇప్పటికే ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్, గతంలో ఎన్నడూలేని విధంగా హజ్‌యాత్రకు వెళ్లేందుకు రూ.80 వేలు కేటాయించడంతోపాటు గన్నవరం నుంచి కూడా విమాన సౌకర్యం కల్పించడం ద్వారా జగనన్న ముస్లింల పక్షపాతిగా నిలిచారని కొనియాడారు.

ఘనంగా ప్రపంచ సండే స్కూల్ దినోత్సవం



జగ్గయ్యపేట అర్బన్: ప్రపంచ సండే స్కూల్(సబ్బాతు బడుల దినోత్సవం) దినోత్సవ వేడుకలను పట్టణంలోని చర్చిలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సెయింట్ థామస్ సీఎస్ఐ టౌన్ చర్చిలో డీనరీ చైర్మన్ పాల్‌రాజు సిలారపు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. చర్చిలో సండేస్కూల్ విభాగం ఇన్‌చార్జ్ ఎలిజబెత్తు నేతృత్వంలో చిన్నారులు ప్రదర్శించిన స్కిట్‌లు, పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. చర్చి కమిటీ సభ్యులు, సంఘస్తులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



నందిగామ: రౌడీషీటర్లు సత్‌ప్రవర్తన కలిగి ఉంటే వారిపై రౌడీషీట్ తొలగించడానికి అవకాశం ఉంటుందని ఏసీపీ జనార్దన్‌నాయుడు పేర్కొన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రౌడీ షీటర్లు సత్ ప్రవర్తనతో మెలగాలని సూచించారు. రౌడీషీట్ నమోదైనవారిపై ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా ఉంటుందని గుర్తుచేశారు. వివాదాలకు పోయి జైలుపాలు కావద్దని రౌడీషీటర్లను హెచ్చరించారు. ఇన్‌స్పెక్టర్ హనీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈఎండీపీ సర్వే

గానుగపాడు(తిరువూరురూరల్): విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించి తద్వారా భవిష్యత్‌లో వారు మంచి పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు చేపట్టిన మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమానికి సంబంధించి విద్యాశాఖ చేపట్టిన ఈఎండీపీ సర్వేను గానుగపాడు జెడ్పీ హైస్కూల్ పరిధిలో నిర్వహించారు. వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్లో నమోదు చేస్తున్నట్లు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఆదిలక్ష్మి తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నా

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



మోగులూరులో సిమెంటురోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

మోగులూరు(కంచికచర్ల): నందిగామ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మౌలికవసతులు కల్పిస్తూ గ్రామాల అభివృద్ధికి విశేషంగా కృషిచేస్తున్నానని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని మోగులూరులో చేపట్టిన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ఆయన కొబ్బరికాయకొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులతో ప్రతి గ్రామంలోనూ మౌలికవసతులు మెరుగుపడ్డాయన్నారు. గ్రామాల్లో మౌలికవసతుల కల్పనకు ప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చుచేయడంతోపాటు గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా కూడా ప్రతి సచివాలయానికి రూ.20లక్షలు కేటాయించిందని వివరించారు. గ్రామాల్లో నెలకొని ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు నివసించే ప్రాంతాల అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కులమతాలకు అతీతంగా అందరికీ మేలు జరిగేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని వివరించారు. మోగులూరు ఎస్సీకాలనీ ఏరియాలో రూ.10లక్షల మండల పరిషత్‌నిధులతో, ఎస్టీకాలనీ ఏరియాలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.10లక్షలతో సిమెంటురోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులు ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాలు నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. అధికారులు, ప్రజల ద్వారా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నానని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో సర్పంచి షేక్ మొయిద్దీన్‌బీ, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, ఎంపీటీసీ సభ్యులు ఆవల సామ్రాజ్యం, మాజీ సర్పంచి షేక్ హుస్సేన్, నాయకులు వేల్పుల రమేష్, మార్త శ్రీనివాసరావు, బంకా కృష్ణారావు, మరియదాసు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధురాలు గోపమ్మకు నివాళి



గోపమ్మ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పరిటాల(కంచికచర్ల) : పరిటాలలో ఇటీవల మృతి చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు ఆకుల గోపమ్మ(98) కుటుంబసభ్యులను నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు ఆదివారం పరామర్శించారు. గోపమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గోపమ్మ కుటుంబసభ్యులను ఓదార్చి, వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోపమ్మలాంటి మహిళలు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనడం ద్వారానే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఆమె పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శప్రాయమని కొనియాడారు. గోపమ్మకు నివాళులర్పించినవారిలో వైఎస్సార్‌సీపీ మండల సచివాలయాల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్, నాయకులు మార్త శ్రీనివాసరావు, మాగంటి వినయభూషణరావు ఉన్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు



అమ్మవారికి బోనం తెస్తున్న భక్తులు

పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవుదినం కావడంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువ జామునుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేదతీరారు.

ప్రత్యేక క్యాంపునకు 449 అర్జీలు

జగ్గయ్యపేట అర్బన్: ఓటర్ల జాబితా మార్పులు, చేర్పుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపునకు జగ్గయ్యపేట నియోజకవర్గపరిధిలోని ఆయా మండలాల్లో ఆదివారం 449 అర్జీలు అందినట్లు పేట తహశీల్దార్ సూర్యారావు తెలిపారు. జగ్గయ్యపేట పట్టణంలో 26 అర్జీలు, పేట మండలంలో 225, వత్సవాయి మండలంలో 33 అర్జీలు, పెనుగంచిప్రోలు మండలంలో 82, నందిగామ మండలం పరిధిలోని ఏటి పట్టు గ్రామాల్లో 83 అర్జీలు అందినట్లు ఆయన వివరించారు.

వాహనాల విస్తృత తనిఖీ

పెద్దాపురం(వీరులపాడు): ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మద్యం అక్రమ రవాణా సాగకుండా పటిష్ట చర్యలు తీసుకున్నట్లు ఎస్‌ఐ మహాలక్ష్మణుడు తెలిపారు. మండలంలోని పెద్దాపురం పోలీస్ అవుట్ వద్ద ఆదివారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం అక్రమ రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు గ్రామాల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ముమ్మర తనిఖీలు చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ముందుకు పంపిస్తున్నట్లు వివరించారు.

విద్యా వ్యవస్థ పటిష్టతకు కృషి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వరరావు

ఇబ్రహీంపట్నం: విద్యా వ్యవస్థ పటిష్టతకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు అన్నారు. ఇబ్రహీంపట్నంలో ఆదివారం జరిగిన యూటీఎఫ్ జిల్లా ద్వితీయ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదవడం, రాయడం, ఆంగ్లంపై చొరవ తీసుకుని తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, మనోహర్ కుమార్ యూటీఎఫ్ జిల్లా కార్యవర్గం చేపడుతున్న సదస్సులు, సమావేశాలను కొనియాడారు. జిల్లా నాయకులతో పాటు ఎంఈఓ పుష్పలత, మండల అధ్యక్షుడు బాణావత్ అమర్ నాయక్, ప్రధాన కార్యదర్శి ఆర్మ్‌స్ట్రాంగ్ పాల్గొన్నారు.

కార్తిక పూజలకు శివగిరి ముస్తాబు



శివగిరిపై ఉన్న 36 అడుగుల పంచముఖ శివలింగం, 40 అడుగుల ఓంకార స్తూపం

- నెల రోజుల పాటు స్వామి వారికి అభిషేకాలు
- పౌర్ణమి రోజు నాగసాధువులతో ప్రత్యేక పూజలు
- ప్రతి రోజూ 21 మంది జంటలతో కేదారేశ్వర వ్రతం



మల్లికార్జున శర్మ, శివగిరి వ్యవస్థాపకుడు

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): స్థానిక మొగల్రాజపురంలోని శ్రీవాగ్దేవీ జ్యోతిర్లింగ క్షేత్రం(శివగిరి) కార్తిక మాస పూజలకు సిద్ధమైంది. ఈ నెల 14వ తేదీ నుంచి డిసెంబర్ 13వ తేదీ వరకు కార్తిక మాసం సందర్భంగా శివగిరిపై ప్రత్యేక పూజలు జరుగనున్నాయి. ప్రతి రోజూ 21 జంటలతో కేదారేశ్వరవ్రతం నిర్వహించనున్నారు. శివగిరిపై 36 అడుగుల పంచముఖ శివలింగం, 40 అడుగుల ఎత్తున ఓంకార స్తూపం, ద్వాదశ జ్యోతిర్లింగాలు, నవగ్రహాలు, శివపరివారం, రాహు కేతువులు, దుర్గాదేవి, సరస్వతీదేవి విగ్రహాలు, అష్టాదశ శక్తి పీఠాలు, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం, గోశాల, ఏడు అడుగుల నాగ పుట్ట, నాగదేవత, నంది విగ్రహాలు ఉన్నాయి.

శివయ్యకు నిత్య పూజలు..

కార్తికమాసం సందర్భంగా ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు శివలింగానికి రుద్రాభిషేకం, రుద్రహోమం, కుంకుమార్చన, సహస్ర లింగార్చన, మహాలింగార్చన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, సాయంత్రం 6 నుంచి 8.30 గంటల వరకు ప్రదోష పూజ, శివ కల్యాణం నిర్వహిస్తామని శివగిరి వ్యవస్థాపకుడు మల్లికార్జున శర్మ తెలిపారు. కార్తిక పౌర్ణమి రోజున శివలింగానికి నాగ సాధువులతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. నగర పరిధిలో భక్తులు కోరిన ప్రాంతాల్లో స్వామి వారి ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు ఎవరైనా తన సొంత ఖర్చులతో శివగిరిపై శివలింగాన్ని ప్రతిష్ఠించుకోవచ్చన్నారు. శివగిరిపై జరిగే పూజలను సోషల్ మీడియా ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తామని తెలిపారు. పూజల వివరాలకు 98481 14960లో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.



ఏడు అడుగుల నాగ పడగ



శివ పరివారం విగ్రహాలు



శివగిరిపై శివలింగానికి నాగ సాధువుల పూజలు (ఫైల్)

19న జాతీయ కవి సమ్మేళనం

విజయవాడ కల్చరల్: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ ఆదివారం మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో 125వ జాతీయ స్థాయి కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు శ్రీశ్రీ కళావేదిక కృష్ణాజిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ కేఆర్ శేషుకుమార్ తెలిపారు. మొగల్రాజపురంలోని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. శ్రీశ్రీ కళావేదిక ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాలలో 124కు పైగా కవి సమ్మేళనాలు నిర్వహించినట్లు తెలిపారు. 19వ తేదీ జరిగే కార్యక్రమంలో యువ కవులు ఎవరైనా స్వీయకవితా గానం చేయవచ్చని ఎటువంటి ప్రవేశ రుసుములేదని కవులకు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ బ్రోచర్‌ను అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి. విజయబాబు ఆవిష్కరించారు. శ్రీశ్రీ కళావేదిక జిల్లా బాధ్యులు డాక్టర్ కొల్లేటి రమేష్, శ్రీశ్రీ కళావేదిక యువ ప్రతినిధులు డాక్టర్ కొల్లేటి రమేష్, నాగపావని,భానుతేజ, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాలకు జలకళ



ఎత్తిపోతల పథకాలకు వస్తున్న సాగునీటిని పరిశీలిస్తున్న రైతులు

నందిగామ: వర్షాభావ పరిస్థితుల కారణంగా అడుగంటిన ఎత్తిపోతల పథకాలు ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను చొరవతో నేడు జలకళను సంతరించుకున్నాయి. వర్షాభావ పరిస్థితులతో నందిగామ మండలంతో పాటు జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని ఏటి పట్టు గ్రామాల్లో పంటలకు సరైన నీరు అందని పరిస్థితి నెలకొంది. దీంతో పరిస్థితిని ఏటిపట్టు గ్రామాల నాయకులు సమస్యను ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి ఏగువన ఉన్న తెలంగాణ ప్రాంతంలోని ప్రజాప్రతినిధులు, అధికారులతో మాట్లాడి నియోజకవర్గ పరిధిలోని ఉపనదులకు నీరు విడుదలయ్యేలా చర్యలు చేపట్టారు. తెలంగాణ ప్రాంతంలో విడుదల చేసిన నీరు ఆదివారం నందిగామ ప్రాంతానికి చేరింది. ఈ క్రమంలో మండలంలోని కొణతమాత్మకూరు సమీపంలోని రెండు వ్యవసాయ ఎత్తిపోతల పథకాలకు నీరు చేరింది. ఈ నీటితో వందలాది ఎకరాలకు ప్రయోజనం కలుగుతుందని కొణతమాత్మకూరు సర్పంచ్ మేడా కోటేశ్వరరావు తెలిపారు. రైతులను ఆదుకునేందుకు సాగునీరు అందేలా చేసిన సామినేని ఉదయభాను చేసిన కృషికి ఎత్తిపోతల పథకాల ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తంచేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

కోట్లాది రూపాయలతో పేట అభివృద్ధి

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



యాదవబజారులో డ్రైనేజీ ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: తమ కౌన్సిల్ అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో జగ్గయ్యపేట పట్టణాన్ని రూ.27కోట్లతో అభివృద్ధి చేసినట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. స్థానిక పదోవార్డు, యాదవ బజారులో నూతనంగా డ్రెయిన్ ఏర్పాటు చేయనున్న స్థలాన్ని స్థానికులతో కలసి ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వీధిలో డ్రైనేజీ సదుపాయం లేక ప్రజలు ఇబ్బందులుపడుతున్నామని తెలియజేయడంతో మున్సిపల్ సాధారణ నిధుల నుంచి డ్రెయిన్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సారథ్యంలో పేట పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. రానున్న రోజుల్లో పట్టణంలోని అన్నివార్డుల్లో అవసరమైనచోట్ల డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వార్డు నాయకులు షేక్ సైదా, కొరకూటి సైదులు, అప్పారావు, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

రూ.58లక్షలతో ఆలయ పునర్నిర్మాణ పనులు



శరవేగంగా సాగుతున్న ఆలయ పునర్నిర్మాణ పనులు

పెద్దాపురం(వీరులపాడు):మండలంలోని పెద్దాపురంలో వేంచేసియున్న దాసాంజనేయస్వామి వారి ఆలయ పునర్నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. 200 ఏళ్లనాటి ఈ పురాతన ఆలయంలో వేంచేసియున్న దాసాంజనేయస్వామిని దర్శించుకునేందుకు ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి నిత్యం పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా పేరొందిన దాసాంజనేయస్వామి ఆలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తులు ఆలయాన్ని పునర్నిర్మాణానికి సహకరించాలంటూ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావును కోరారు. స్పందించి ఎమ్మెల్యే వెంటనే సమస్యను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి దేవాదాయశాఖ ద్వారా ఆలయ పునర్నిర్మాణానికి రూ.58లక్షలు మంజూరు చేయించారు. ప్రభుత్వ నిధులతోపాటు గ్రామస్తులు, దాతల సహకారంతో చేపట్టిన ఆలయ పునర్నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఆలయ పునర్నిర్మాణానికి రూ.58లక్షలు మంజూరు చేయించిన ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావుతోపాటు రాష్ట్రప్రభుత్వానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. త్వరలోనే పనులను పూర్తి చేసి పునః ప్రతిష్ఠా కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు చెబుతున్నారు.

ఫైర్ సేఫ్టీ నిబంధనలు తప్పకుండా పాటించాలి



టపాసుల దుకాణాదారుడికి సూచనలిస్తున్న ఏసీపీ జనార్దన్‌నాయుడు

నందిగామ: దీపావళి టపాసుల స్టాక్ పాయింట్ నిర్వాహకులు తప్పనిసరిగా ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలని ఏసీపీ జనార్దన్ నాయుడు సూచించారు. మండలంలోని రాఘవాపురం, చందాపురం గ్రామ సమీపాల్లోని దీపావళి మందుల హోల్‌సేల్ స్టాక్ పాయింట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అనుమతులకు సంబంధించిన పత్రాలతోపాటు గోదాములోని స్టాక్‌ను పరిశీలించారు. ముఖ్యంగా ఫైర్ సేఫ్టీకి సంబంధించి ఏర్పాటుచేసిన ముందు జాగ్రత్త చర్యలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఏసీపీ మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ హనీష్, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మకాలకు అనుమతులు తప్పనిసరి..

వత్సవాయి : గ్రామాల్లో దీపావళి టపాసులు అమ్మకాలు జరిపేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్‌ఐ బి అభిమన్యు ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. పోలీస్, రెవెన్యూ శాఖలకు చెందిన అధికారుల సూచనల మేరకు నిర్దేశించిన స్థలంలోనే టపాసులు అమ్మకాలు చేసుకోవాలని సూచించారు, అనుమతులు లేకుండా అమ్మకాలు జరిపితే సీజ్ చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

'ఇగ్నో'లో అత్యుత్తమ నాణ్యతాప్రమాణాలు



మాట్లాడుతున్న డాక్టర్ ప్రసాద్‌బాబు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రపంచంలోనే అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలను పాటించే విద్యాసంస్థల్లో ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) మొదటిదని ఆ సంస్థ విజయవాడ ప్రాంతీయ కేంద్రం సహాయ సంచాలకుడు డాక్టర్ బి. ప్రసాద్‌బాబు అన్నారు. కేబీఎన్ కళాశాల ఇగ్నో స్టడీ సెంటర్ నూతన విద్యార్థుల ఇండక్షన్ మీటింగ్ ఆదివారం ఆ కళాశాల ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ప్రసాద్ బాబు మాట్లాడుతూ ఉన్నత విద్యారంగంలో ఇగ్నోకు ప్రత్యేక స్థానముందన్నారు. ప్రధానంగా విద్యార్థులకు వారివారి కోర్సులకు సంబంధించి సంపూర్ణ జ్ఞానం అందించే దిశగా కోర్సు రూపకల్పన ఉంటుందన్నారు. సుమారు మూడు దశాబ్దాలుగా ఇగ్నో ఉన్నత విద్యారంగ వ్యాప్తికి ఇతోదిక సేవలందిస్తుందన్నారు. ఇటీవలే యూజీసి నాక్ నుంచి ఏ డబుల్‌ప్లస్ గ్రేడ్‌ను సాధించి ప్రమాణాల విషయంలో అగ్రగామిలో ఉందని రుజువు చేసిందన్నారు. తరగతుల నిర్వహణతో పాటుగా, ప్రయోగశాలలో సాధన, ఎసైన్‌మెంట్లు తదితర రూపాల్లో బోధనా పద్ధతులు ఉంటాయన్నారు. కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో సుదీర్ఘ కాలంగా ఇగ్నో స్టడీ సెంటర్ కొనసాగుతుందని వివరించారు. స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ ఎన్. సాంబశివరావు మాట్లాడుతూ తమ స్టడీ సెంటర్‌లో క్రమం తప్పకుండా తరగతులు కొనసాగటమే కాకుండా మంచి సదుపాయాలు ఉన్నాయని వివరించారు. సుదీర్ఘకాలంగా తమ స్టడీ సెంటర్ నుంచి ఎందరో ఉన్నత విద్యా కోర్సులను పూర్తి చేసి మంచి స్థాయిల్లో నిలిచారని వివరించారు. కార్యక్రమంలో స్టడీ సెంటర్ అసిస్టెంట్ కోఆర్డినేటర్లు డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, డి. పవన్‌కుమార్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.